# నేటి నిజం

website:www.netinijam.com  E-mail : netinijam93@gmail.com  తెలుగు దినపత్రిక

హైదరాబాద్  ఆదివారం 5-12-2021  RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  సంపుటి :28  సంచిక: 101  పేజీలు:4  వెల: రూ.1/-


## ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కె.రోశయ్య మృతిపై ప్రధాని సంతాపం

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కె.రోశయ్య మృతిపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

ఈ మేరకు ఒక ట్వీట్ ద్వారా ఇచ్చిన సందేశంలో–"శ్రీ కె.రోశయ్యగారు కన్నుమూయడం ఎంతో బాధాకరం. మేమిద్దరం ముఖ్యమంత్రులుగా పనిచేసిన సమయంలోనే కాకుండా ఆ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆయనతో పలు సందర్భాల్లో నా సంభాషణను నేను గుర్తుచేసుకుంటున్నాను. ప్రజాసేవలో ఆయన కృషి చిరస్మరణీయం. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబసభ్యులకు, మద్దతుదారులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను? ఓం శాంతి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# ఉమ్మడి ఏపీ మాజీ సీఎం రోశయ్య కన్నుమూత







హైదరాబాద్, డిసెంబర్ 4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొణిజేటి రోశయ్య (88) కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆయన హైదరాబాద్‌లోని స్టార్ దవాఖాన లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. అమీర్‌పేటలోని నివాసానికి ఆయన భౌతికకాయాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజకీయ దురంధరుడు కొణిజేటి రోశయ్య.. 1933, జూలై 4న గుంటూరు జిల్లాలోని వేమూరులో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు నేత ఎన్జీ రంగా శిష్యుడైన ఆయన నిడుబ్రోలులో రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌పార్టీలో కొనసాగిన రోశయ్య.. 1968లో తొలిసారిగా శాసన మండలికి ఎన్నికయ్యారు. 1968, 74, 80లో వరుసగా మండలికి ప్రాతినిధ్యం వహించారు.

1979లో అంజయ్య ప్రభుత్వంలో తొలిసారిగా మంత్రిగా బాధ్యలు చేపట్టారు. 1982లో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ప్రభుత్వంలో హోంశాఖ మంత్రిగా, 1989లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, రవాణా, విద్యుత్ శాఖ మంత్రిగా సేవలు అందించారు. 1992లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్ శాఖలు చేపట్టారు. 1998లో నరసరావుపేట నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2004, 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సర్కార్‌లో ఆర్థిక మంత్రిగా బాధ్యలు నిర్వహించారు.

ఉమ్మడి ఏపీలో పలు కీలక శాఖలు నిర్వహించిన ఆయన సుదీర్ఘకాలం ఆర్థికమంత్రిగా పనిచేశారు.

మొత్తం 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2009లో సీఎం రాజశేఖర్ రెడ్డి హఠాన్మరణంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 15వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2009 సెప్టెంబర్ 3 నుంచి 2011 జూన్ 25 వరకు సీఎంగా పనిచేశారు. అనంతరం ఐదేండ్లపాటు తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2011 ఆగస్టు 31న తమిళనాడు 31వ గవర్నర్‌గా బాధ్యలు చేపట్టిన రోశయ్య.. 2016, ఆగస్టు 30 వరకు ఆ పదవిలో కొనసాగారు. వయోభారంతో గత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

### మాజీ సీఎం రోశయ్యకు సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ నివాళి

హైదరాబాద్, డిసెంబర్ 4:ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పార్థివదేహానికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబీకులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోశయ్య మరణం బాధ కలిగించిందన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్త నుంచి సీఎం, గవర్నర్ స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కళలు, సాహిత్యంపై అభిమానం ఉన్న వ్యక్తన్నారు. ఆయన సేవలు మరువలేనివని, అన్ని పదవులకు వన్నె తీసుకువచ్చారన్నారు.

### రోశయ్య మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, డిసెంబర్ 4:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. ఆర్థికశాఖ మంత్రిగా పలు పదవులకు రోశయ్య వన్నె తెచ్చారని అన్నారు. సౌమ్యుడిగా, సహనశీలిగా రాజకీయాల్లో తనదైన శైలిని ప్రదర్శించేవారని గుర్తుచేసుకున్నారు. రోశయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రోశయ్య నన్ను ప్రోత్సహించేవారు: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్, డిసెంబర్ 4:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని మంత్రి హరీశ్ రావు (ఊజీతీతిబష్త తీజీనీ) అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆయనకు మిత్రులు ఉన్నారని చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ప్రత్యేక శైలిని చాటుకున్న రోశయ్య మృతిచెందడం బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆంకాంక్షించారు.

దేశ చరిత్రలోనే ఒక రాష్ట్ర శాసన సభలో 15 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఆయన చేయని పదవిలేదు, గౌరవం లేదన్నారు. ఆయన పనిచేసిన అందరు సీఎంలో మన్ననలు పొందారని చెప్పారు.

రోశయ్యతో తనకు ఎంతో అనుబంధం ఉందని, తనను ఎంతో ప్రోత్సహించేవారని గుర్తుచేసుకున్నారు. ఆయతో కలిసి మంత్రిగా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే తెలంగాణ ప్రకటన వచ్చిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నిబద్ధత గల రాజకీయవేత్త రోశయ్య : వెంకయ్య నివాళి

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు పూర్వ గవర్నర్ కొణిజేటి రోశయ్య మృతిపట్ల భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు విచారం వ్యక్తం చేశారు. ఆయన పరమపదించారని తెలిసి ఎంతో విచారించానన్నారు. తెలుగు రాజకీయాలతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ అంకితభావం, నిబద్ధతతో ముందుకు సాగిన రోశయ్య ఆదర్శప్రాయులుగా నిలిచారని కొనియాడారు.

ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయాల్లో ప్రవేశించి, ఎమ్మెల్సీగా చట్టసభల్లో అడుగుపెట్టారని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, వివిధ శాఖలకు రాష్ట్ర మంత్రిగా ప్రజాసమస్యల విషయంలో రోశయ్య నిరంతర పోరాటం చేశారని వెంకయ్యనాయుడు గుర్తుచేసుకున్నారు. ఓర్పు, నేర్పుతో తాను చేపట్టిన పదవులను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. తమిళనాడు గవర్నర్‌గా హుందాగా వ్యవహరించారని పేర్కొన్నారు. రోశయ్య తనకు చిరకాల మిత్రుడని, సర్వజన హితాభిలాషి, చక్కని వక్త అని, వివిధ అంశాలపై స్పష్టమైన విషయ పరిజ్ఞానం, ప్రసంగాల్లోనూ ఎవరినీ నొప్పించకుండానే విషయాన్ని సూటిగా, స్పష్టంగా తెలియజేయటంలో సిద్ధహస్తులుగా గుర్తింపు పొందారన్నారు. 16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత వారికి దక్కిందని, మంచి వక్తృత్వం, చక్కటి వ్యక్తిత్వంతో నిగర్విగా, నిరాడంబరంగా జీవించిన రోశయ్య ఇకలేరనే వార్త బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని వెంకయ్యనాయుడు తన సంతాప సందేశంలో తెలిపారు.

## ప్రముఖ నటుడు శివరాం కన్నుమూత

బెంగళూర్, డిసెంబర్ 4:: ప్రముఖ కన్నడ నటుడు శివరాం శనివారం బెంగళూర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో తుదిశ్వాస విడిచారు. 83 ఏండ్ల శివరాం మంగళవారం రాత్రి తన నివాసంలో పూజ చేస్తూ కుప్పకూలారు. శివరాంను కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకువెళ్లగా ఆయన బ్రెయిన్ హెమరేజ్‌తో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. వయసు రీత్యా ఆయనకు సర్జరీ చేయలేమని వైద్యులు పేర్కన్నారు. కొద్దిసేపటి కిందట శివరాం కన్నుమూయడంతో ఆయన అభిమానులు, సినీ పరిశ్రమకు చెందిన వారంతా శోకసంద్రంలో మునిగారు.

వారం కిందట శివరాంకు కారు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. 1938, జనవరి 28న జన్మించిన శివరాం 1958లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆయన తన సినీ కెరీర్‌ను ప్రారంభించారు. కేఆర్ సీతారామ శాస్త్రి, పుట్టన్న కనగల్, సింగీతం శ్రీనివాసరావు వంటి అగ్ర దర్శకుల వద్ద శివరాం పనిచేశారు. 1965లో బెరెత జీవ అనే చిత్రంతో నటుడిగాను తెరంగేట్రం చేశారు. ఆపై క్యారెక్టర్ నటుడిగానూ శివరాం సత్తా చాటారు. 1972లో హృదయ సంగమ అనే చిత్రంతో శివరాం దర్శకుడిగా మారారు. కన్నడలో పలు సినిమాలు నిర్మించిన శివరాం రజనీకాంత్‌తో తమిళంలో ధర్మ దురై అనే సినిమాను నిర్మించారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



(డిసెంబర్ 5 కాశ్మీరు నేత షేక్ అబ్దుల్లా జయంతి..)

–రాధశ్రీ

సెల్: 9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో రోశయ్య అంత్యక్రియలు

హైదరాబాద్, డిసెంబర్ 4:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య (ఖీనీబజీతిజీష్ర) మృతిపట్ల రాష్ట్ర ప్రభుత్వం సంతాపం ప్రకటించింది. ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు రోజులపాటు సంతాప దినాలుగా ప్రకటించింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు హైదరాబాద్‌లోని మహాప్రస్తానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి, హైదరాబాద్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య భౌతిక కాయానికి సీఎం కేసీఆర్ నివాళులర్పించనున్నారు. కాసేపట్లో అమీర్‌పేటలోని ఆయన నివాసానికి సీఎం చేరుకోనున్నారు. ఈనేపథ్యంలో సాధారణ పరిపాలన, ప్రొటోకాల్ అధికారులు రోశయ్య నివాసానికి చేరుకున్నారు.

## నేడు గాంధీభవన్‌కు రోశయ్య భౌతికకాయం

ఉమ్మడి ఏపీ మాజీ సీఎం రోశయ్య అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో జరగనున్నాయి. అమీర్‌పేటలో ఉన్న ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం నాంపల్లిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన గాంధీభవన్‌కు తరలించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు అక్కడే ఉంచనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గాంధీభవన్ నుంచి రోశయ్య అంతిమయాత్ర ప్రారంభమవనుంది. మధ్యాహ్నం ఒంటిగంటకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్తానంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

## దిశ మార్చుకున్న జవాద్.. ఉత్తరాంధ్రకు వాన ముప్పు!

హైదరాబాద్, డిసెంబర్ 4:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని టెన్షన్ పెడుతున్న జవాద్ తుపాను దిశ మార్చుకుని ఒడిశా వైపుగా కదులుతోంది. విశాఖకు ఆగ్నేయంగా 210 కి.మీ. దూరంలో, గోపాల్‌పూర్‌కు 320 కి.మీ. దూరంలో తుపాను కేంద్రీకృతమైంది. ప్రస్తుతం గంటకు 6 కి.మీ. వేగంతో జవాద్ తుపాను పయనిస్తోంది. రేపు మధ్యాహ్నానికి పూరీకి సమీపంలో వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఒడిశాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది.

## కోర్టుకు రావడమనేది ఆఖరి ప్రత్యామ్నాయం కావాలి: సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

హైదరాబాద్, డిసెంబర్ 4: కోర్టుకు రావడమనేది ఆఖరి ప్రత్యామ్నాయం కావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల కాలయాపన జరుగుతుందని చెప్పారు. విస్తృత సంప్రదింపులతో ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ సన్నాహక సదస్సుకు సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోర్టులకు వచ్చేముందే మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా తక్కువ సమయంలో పరిష్కారాలు లభిస్తాయని చెప్పారు. పెండింగ్ కేసుల సత్వర విచారణ జరగాలన్నారు.

మహాభారతంలోనూ మధ్యవర్తిత్వం ప్రస్తావన ఉన్నదని పేర్కొన్నారు. సంప్రదింపుల ద్వారా సమస్యలు కొలిక్కి తేవచ్చని వెల్లడించారు. ఆస్తుల పంపకాలను కుటుంబ సభ్యులు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సాధ్యమైనంతవరకు మహిళలు మధ్యవర్తిత్వంలో వివాదాలు పరిష్కరించుకోవాన్నారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్ సరైన వేదిక అని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు.



## హైదరాబాద్‌లో IAMC ఏర్పాటు సంతోషకరం: సీఎం కేసీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 4:హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఎంఓఅ) ఏర్పాటు చేయడం సంతోషకరమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు అన్నారు. ఇవాళ హెచ్ఐసీసీలో జరిగిన ఎంఓఅ సదస్సులో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, పలువురు న్యాయమూర్తులు హాజరైన ఈ సదస్సులో సీఎం మాట్లాడారు. నగరంలో ఎంఓఅ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నందుకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు ఆయన తరఫున, తెలంగాణ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్బిట్రేషన్ కేంద్రానికి హైదరాబాద్ అన్నివిధాలా అనువైన ప్రాంతమని సీఎం కేసీఆర్ చెప్పారు. అతితక్కువ కాలంలోనే హైదరాబాద్ నగరంలో ఎమర్జింగ్ సిటీగా ఎదిగిందని అన్నారు. హైదరాబాద్ అన్ని రకాల సంస్థలు, పరిశ్రమల ఏర్పాటుకు, పెట్టుబడులకు అనువైనదన్నారు. ఇక, మధ్యవర్తిత్వం అనేది దేశంలో రచ్చబండ లాంటి వేదికల రూపాల్లో ఎప్పటి నుంచో ఉన్నదని చెప్పారు. గ్రామాల్లో పెద్దలు పంచాయతీలు ఏర్పాటు చేసి వివాదాలు పరిష్కరించేవారని అన్నారు.

దేశంలో వివిధ కారణాలతో పరిశ్రమలు వివాదాలు ఎదుర్కొంటున్నాయని సీఎం కేసీఆర్ అన్నారు. అయితే, దేశంలో కోర్టులు, సిబ్బంది కొరత కారణంగా ఇలాంటి వివాదాల ఏండ్ల కొద్ది పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉంటున్నాయని చెప్పారు. ఈ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ల ఏర్పాటు ద్వారా పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు సంబంధించిన వివాదాలు తొందరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నదని చెప్పారు.

ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటు కోసం ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే 25 వేల చదరపు అడుగుల స్థలం కేటాయిస్తున్నామని, శాశ్వత భవనం కోసం త్వరలో పుప్పాలగూడలో భూమిని కేటాయిస్తామని సీఎం తెలిపారు.

## బాలిక అదృశ్యం.. పొరుగింటి వ్యక్తి లారీలో మృతదేహం

లక్నో, డిసెంబర్ 4:: అదృశ్యమైన బాలిక.. పొరుగింటి వ్యక్తి లారీలో మృతదేహంగా కనిపించింది. పోలీసులు అతడ్ని అరెస్ట్ చేయగా, కొట్టి చంపేందుకు స్థానికులు ప్రయత్నించారు. ఉత్తరప్రదేశలోని హాపూర్‌లో ఈ ఘటన జరిగింది. ఆరేండ్ల బాలిక గురువారం నుంచి కనిపించలేదు. తమ కుమార్తె రూ.5 అడిగిందని, ఏదో కొనేందుకు గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదంటూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, పొరుగింట్లో ఉండే వ్యక్తి ఆ బాలికను తొలుత బైక్‌పై ఎక్కించుకుని వెళ్లాడని, అనంతరం తన ఇంటికి తీసుకెళ్లినట్లుగా స్థానిక సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించినట్లు బాలిక తండ్రికి ఒకరు తెలిపారు. మరోవైపు పొరుగింటి వ్యక్తి ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నదని పోలీసులకు శనివారం సమాచారం అందింది. దీంతో అక్కడకు వెళ్లిన పోలీసులు తాళం వేసి ఉన్న ఆ ఇంటి డోర్‌ను పగులగొట్టారు. లోపలికి వెళ్లి చూడగా అక్కడున్న లారీలో బాలిక మృతదేహం కనిపించింది. పోస్ట్‌మార్టం కోసం బాలిక మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

## కూరెళ్ల విఠలాచార్య, కళాకృష్ణకు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారాలు

హైదరాబాద్, డిసెంబర్ 4:పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శనివారం విశిష్ట పురస్కారాలను ప్రకటించింది. 2018, 2019 సంవత్సరాలకు గాను కూరెళ్ల విఠలాచార్య, కళాకృష్ణను పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ నెల 12న హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నారు. పురస్కారంగా ఒక్కొక్కరికి రూ.లక్ష నగదుతో పాటు ప్రశంసాపత్రం అందించనున్నారు.



డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యంతో ఎనలేని సేవలందించారు. కవిగా, విమర్శకునిగా, ఉపాధ్యాయుడిగా.. సాహిత్యం, విద్యావ్యాప్తికి ఎంతో సేవ చేయడంతో పాటు ఎంతో మందిని కవులుగా, రచయిలుగా తీర్చిదిద్దిన ఆయనకు తెలుగు యూనివర్సిటీ 2018 సంవత్సరానికి గాను విశిష్ట పురస్కారాన్ని ప్రకటించింది. విఠలాచార్య 1938లో యాదాద్రి భువనగిరి జిల్లా వెల్లంకి గ్రామంలో జన్మించారు. కవిగా 22 పుస్తకాలను వెలువరించారు. పదవీ విరమణ అనంతరం తన స్వగ్రామంలోని తన గృహంలో సుమారు రెండు లక్షల గ్రంథాలతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు.

కూచిపూడి, ఆంధ్రనాట్యంలో గురువుగా, నర్తకునిగా విశేష సేవలందించిన కళాకృష్ణకు 2019 సంవత్సరానికి విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారాన్ని ప్రకటించింది. 1951లో కరీంనగర్ జిల్లాలో జన్మించిన కళాకృష్ణ డాక్టర్ నటరాజ రామకృష్ణ వద్ద ఆంధ్రనాట్యాన్ని అభ్యసించారు. భరతనాట్యం, కూచిపూడి నాట్య శైలుల్లో కూడా శిక్షణ పొందారు. 'నవజనార్ధన పారిజాతం' ప్రదర్శించడంలో కళాకృష్ణ తనదైన రసజ్ఞ మోహనమైన ముద్రవేశారు. సత్యభామ పాత్రలో అపూర్వమైన అభినయానికి మెచ్చి కళాభిమానులు ఆయనను 'అభినవ సత్యభామ' అని ప్రశంసించారు. కళాకారుడిగా, అధ్యాపకుడిగా 45 ఏళ్లుగా సేవలందిస్తూ వేలాది ప్రదర్శనలిచ్చారు.

# యాదాద్రి విమాన గోపురానికి బంగారం విరాళమిచ్చిన విశ్రాంత ఉద్యోగి



యాదాద్రి, డిసెంబర్ 4:: యాదాద్రి ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయించే మహత్తర యజ్ఞానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. సీఎం పిలుపు అందుకున్న పలువురు ఆలయ గోపురం కోసం బంగారం విరాళాలు ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక విశ్రాంత ఉద్యోగి అయిన తిరునగరు యదగిరి కూడా తన వంతు సాయం చేస్తానంటూ ముందుకొచ్చారు. మంత్రి జగదీష్ రెడ్డికి పదివేల రూపాయల చెక్ అందజేశారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి లక్ష్మి నరసింహస్వామి ఆలయాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆలయ విమాన గోపురం బంగారు తాపడం కోసం కావాల్సిన బంగారాన్ని విరాళంగా అందించేందుకు భక్తులు విశేష సంఖ్యలో ముందుకు వస్తున్నారు.

ఈ క్రమంలోనే సూర్యపేటకు చెందిన విశ్రాంతి ఉద్యోగి తిరునగరు యాదగిరి తన వంతుగా రెండు గ్రాముల బంగారాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు శనివారం ఉదయం సూర్యపేట జిల్లా కేంద్రంలో మంత్రి జగదీష్ రెడ్డిని కలిసి రెండు గ్రాముల బంగారానికి అయ్యే మొత్తం పదివేల రూపాయలను చెక్ రూపంలో అందజేశారు. అంతకు ముందు కూడా యాదగిరి.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన హరిత నిధికి నిధులు ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

# మంథని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం

మంథని, డిసెంబర్ 4: : పెద్దపల్లి జిల్లాలో పెద్దపులి కలకలం సృష్టిస్తున్నది. మంథని మండలం అడవి సోమన్‌పల్లి గ్రామంలో సచరిస్తున్నది. దీంతో అటవీ గ్రామాల ప్రజలకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఫారెస్ట్ అధికారుల సమాచారం మేరకు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొయ్యూరు అటవీ ప్రాంతం నుంచి మంథని మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామ పరిధిలోనీ అటవీ ప్రాంతానికి పులి వచ్చినట్లుగా తెలుస్తున్నది. దీంతో అధికారులు అడవి సోమన్‌పల్లి, వెంకటాపూర్, అరేంద, ఖానాపూర్, కాన్సాయిపేట గ్రామస్తులు, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని కోరారు. పొలాల వద్ద ఎలాంటి కరెంట్ తీగలతో ఉచ్చు పెట్టొద్దని సూచించారు.

# మున్సిపల్ టీచర్ల ప్రమోషన్స్ కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

అమరావతి, డిసెంబర్ 4:మూడేళ్ల మున్సిపల్ టీచర్ల ఎదురుచూపులు ఫలించబోతున్నాయి. ఏపీ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ టీచర్ల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పదోన్నతులకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఈ నెల 6 వరకు సీనియారిటీ జాబితాను రూపొందిస్తారు. 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి, 10 నుంచి 13వ తేదీ వరకు పరిష్కరిస్తారు. 14న ఖాళీల జాబితా ప్రకటించి, 15 నుంచి 17 వరకు పదోన్నతుల ప్రక్రియను చేపడతారు.

17న పదోన్నతులు పొందిన వారికి ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపల్ పాఠశాలల్లో భాషా పండిట్లు మినహా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలున్నాయి. గత మూడేళ్లుగా పదోన్నతుల ప్రక్రియ నిర్వహించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో మున్సిపల్ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ కుంటుపడిందనే విమర్శలు నెలకొన్నాయి.

# చారిత్రక స్థలాలకు ప్రత్యేక రైళ్లు..

హైదరాబాద్, డిసెంబర్ 4:దేశంలోని ప్రముఖ సాంస్కృతిక, వారసత్వ, ప్రముఖ చారిత్రక యాత్రా స్థలాలను కలుపుతూ ప్రత్యేక సర్క్యూట్ రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. ఈ రైళ్లను ప్రైవేట్ సంస్థలు నడుపుకొనే అవకాశాన్ని కల్పించాలని నిర్ణయించింది. రైల్వే మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో 'భారత్ గౌరవ్' పేరిట ఇతివృత్త ఆధారిత పర్యాటక సర్క్యూట్ రైళ్లను ప్రవేశపెట్టడానికి ప్రతిపాదించింది. దేశంలోని ముఖ్యమైన యాత్రా స్థలాల విశేషాలను ప్రజలకు, ప్రపంచానికి తెలియచేయాలనేదే ప్రధాన లక్ష్యం. ఈ రైళ్ల ద్వారా ప్రయాణికులు నిరాటంకంగా పర్యటించే అవకాశాలతోపాటు, పర్యాటక రంగం అభివృద్ధికి కూడా తోడ్పడనుంది. వ్యక్తిగతంగా, భాగస్వామ్య సంస్థగా, కంపెనీగా, వ్యాపార సంస్థలు ఇందులో పాల్గొనవచ్చు. భారత్ గౌరవ్ రైళ్ల నిర్వహణలో ప్రైవేట్ సంస్థలకు ఇతివృత్త పర్యాటక మార్గాలను ఎంపిక చేసుకునే, దర్శనీయ స్థలాలు, చార్జీలు, ఇతర అంశాలపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే అవకాశం కల్పిస్తోంది.

పది రోజుల్లో ఈ రైళ్లకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కానుండగా.. ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా ఇండియన్‌రైల్వేస్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నమోదు చేసుకున్న సర్వీసు ప్రొవైడర్లు వారికి కావాల్సిన విధంగా రేక్ కూర్పు(కనీసంగా 14, గరిష్టంగా 20 కోచులు) ఎంపిక చేసుకునే అవకాశముంది. రైల్వే వారి మౌలిక సదుపాయాలను, రోలింగ్ స్టాక్‌ను వినియోగించుకునేందుకు నిబంధనల ప్రకారం 'రైట్ టూ యూజ్' చార్జీలు, ఫిక్స్‌డ్, వేరియబుల్ హాలేజ్ చార్జీలు, స్టాబ్లింగ్ చార్జీలు వంటివి సర్వీసు ప్రొవైడర్లకు విధిస్తారు. ఈ రైళ్లను మెయిల్/ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో సమానంగా పరిగణిస్తారు.

# ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించిన ఐఐటీ-ఖరగ్‌పూర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) అంటేనే ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించే సంస్థ. ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారంటే నెలనెలా లక్షల్లో జీతం వాళ్ల సొంతమైనట్లే. మూడు రోజుల క్రితం ట్విట్టర్ సీఈవోగా నియమితులైన పరాగ్ అగర్వాల్ ఐఐటీ-ముంబై పూర్వ విద్యార్థి. అంతేగాక ఆల్ఫబెట్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఐఐటీ-ఖరగ్‌పూర్‌లో ఇంజినీరింగ్ చదివిన వారే.అంతటి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న ఐఐటీ-ఖరగ్‌పూర్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. 2021-2022 ఏడాదికి సంబంధించి జరుగుతున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా మూడో రోజైన శుక్రవారం ఒక్కరోజే 1,100 మంది ఐఐటీ-ఖరగ్‌పూర్ విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించారు. ఐఐటీల చరిత్రలో ఇంత వేగంగా ఒక్కరోజే 1,100 విద్యార్థులకు ఉద్యోగాలు కల్పి ంచడం ఆల్‌టైమ్ రికార్డు అని ఐఐటీ-ఖ రగ్‌పూర్ ఒక ప్రకటనలో పేర్కొన్నది.మొదటి రోజు జరిగిన ప్లేస్‌మెంట్స్ ప్రక్రియలో ఐఐటీ-ఖరగ్‌పూర్.. క్వాల్కమ్, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఎక్సెల్ సర్వీస్, గోల్డ్‌మాన్ సాచ్స్, జేపీఎంసీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ లాంటి కంపెనీల నుంచి 235 జాబ్ ఆఫర్స్‌ను సొంతం చేసుకున్నది. సాఫ్ట్‌వేర్, అనలిటిక్స్, ఫైనాన్స్, కన్సల్టింగ్, కోర్ రంగాల్లో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నది. మొత్తం ఆఫర్స్‌లో 35 మంది విద్యార్థులకు ఇంటర్నేషనల్ ఆఫర్స్ దక్కాయి. వారిలో ఇద్దరికి రెండు ప్రముఖ కంపెనీలు రూ.2 కోట్లు, రూ.2.4 కోట్ల చొప్పున భారీ ఆఫర్ చేశాయి.

# డిసెంబరు 7న ప్రధానమంత్రి గోరఖ్‌పూర్ సందర్శన; రూ.9600 కోట్ల విలువైన వివిధ పథకాలు జాతికి అంకితం

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 డిసెంబరు 7న గోరఖ్‌పూర్‌ను సందర్శించనున్న నేపథ్యంలో ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు రూ.9600 కోట్ల విలువైన వివిధ పథకాలను జాతికి అంకితం చేస్తారు. ఇందులో భాగంగా 2016 జూలై 22న తన చేతులమీదుగా శంకుస్థాపన చేసిన గోరఖ్‌పూర్ ఎరువుల కర్మాగారాన్ని ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తారు. ఇప్పటికి 30 ఏళ్లకుపైగా మూతపడి ఉన్న ఈ కర్మాగారం పునరుద్ధరణ ప్రక్రియ కింద రూ.8,600 కోట్ల వ్యయంతో తిరిగి నిర్మించబడింది. యూరియా ఉత్పత్తిలో స్వావలంబనపై ప్రధాని దార్శనికత స్ఫూర్తే ఈ ఎరువుల కర్మాగారం పునరుజ్జీవనానికి తోడ్పడింది. గోరఖ్‌పూర్ కర్మాగారంలో ఏటా 12.7 లక్షల టన్నుల దేశీయ వేపపూత యూరియా ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల ముఖ్యంగా పూర్వాంచల్ సహా పరిసర ప్రాంతాల రైతుల యూరియా అవసరాలు తీరడం ద్వారా వారికి ఎనలేని ప్రయోజనం చేకూరుతుంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో సర్వతోముఖ ఆర్థిక వృద్ధికి ఇది ఉత్తేజమిస్తుంది.

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, కోల్ ఇండియా లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ల సంయుక్త-సహకార సంస్థ అయిన హిందుస్థాన్ ఉర్వరక్-రసాయన్ లిమిటెడ్ (ఊజఖీఒ) ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయబడింది. అంతేకాకుండా గోరఖ్‌పూర్‌తోపాటు సింద్రీ, బరౌని ఎరువుల కర్మాగారాల పునరుద్ధరణకూ ఈ సంస్థ కృషి చేస్తోంది. గోరఖ్‌పూర్ ప్లాంటుకు సంబంధించి అమ్మోనియా, యూరియాల కోసం అమెరికాకు చెందిన 'కేబీఆర్', జపాన్‌కు చెందిన 'టోయో' సంస్థ సాంకేతికత/ లైసెన్సుల తోడ్పాటుతో 'టోయో ఇంజనీరింగ్ కార్పొరేషన్, జపాన్ సహా టోయో ఇంజనీరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్టియం నిర్మాణ పనులు పూర్తిచేశాయి. ఈ ప్రాజెక్టులో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన 149.2 మీటర్ల శీతలీకరణ (ప్రిల్లింగ్) టవర్ నిర్మితమైంది. అలాగే భద్రత అంశాల మెరుగుదల కోసం భారత్‌లోనే మొట్టమొదటి వాయు ఆధారిత 'రబ్బర్ డ్యామ్-బ్లాస్ట్ ప్రూఫ్ కంట్రోల్ రూమ్' కూడా ఇక్కడ ఏర్పాటు చేయబడింది.

ప్రధానమంత్రి తన గోరఖ్‌పూర్ పర్యటనలో భాగంగా రూ.1,000 కోట్లకుపైగా వ్యయంతో పూర్తిస్థాయిలో పనిచేసేందుకు సిద్ధం చేసిన 'ఎయిమ్స్' సముదాయాన్ని కూడా జాతికి అంకితం చేస్తారు. ఈ సముదాయానికి 2016 జూలై 22న ప్రధానమంత్రి స్వయంగా శంకుస్థాపన చేశారు. నాణ్యమైన తృతీయ స్థాయి ఆరోగ్య సంరక్షణ లభ్యతలో ప్రాంతీయ అసమానతలను సరిదిద్దాలన్న ప్రధానమంత్రి దృక్కోణానికి అనుగుణంగా ఏర్పాటవుతున్న సంస్థలలో ఒకటిగా 'ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన' కింద ఈ ఆరోగ్య సంస్థను నిర్మించారు. 'ఎయిమ్స్' గోరఖ్‌పూర్‌లోని సౌకర్యాలలో 750 పడకల ఆస్పత్రి, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, ఆయుష్ భవనం, సిబ్బంది మొత్తానికీ నివాస సదుపాయం, యూజీ-పీజీ విద్యార్థులకు హాస్టల్ వసతి తదితరాలు కూడా ఉన్నాయి.

గోరఖ్‌పూర్‌లోని ఐసీఎంఆర్-ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం (ఖీఓఖీఅ) కొత్త భవనాన్ని కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ ప్రాంతంలో జపనీస్ ఎన్సెఫలైటిస్/అక్యూట్ ఎన్సెఫలైటిస్ సిండ్రోమ్ సవాళ్లను ఎదుర్కొనడంలో ఈ కేంద్రం కీలకపాత్ర పోషిస్తోంది. సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల విభాగాల్లో సరికొత్త పరిశోధన కోణాలను ఈ అత్యాధునిక సౌకర్యాలుగల కొత్త భవనం ఆవిష్కరించగలదు. అంతేకాకుండా సామర్థ్యం పెంపులో తోడ్పాటునిస్తూ ఈ ప్రాంతంలోని ఇతర వైద్య సంస్థలకు అండగా నిలుస్తుంది.

# రైతులకు అందుబాటులో వడ్ల కొనుగోళ్లు



మేడ్చల్, డిసెంబర్ 4: తెలంగాణలో రైతులు వర్షాకాలంలో పండించిన వడ్లను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా పదకొండు కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వానాకాలంలో పండించిన వడ్లను కొనుగోలు చేసేందుకు వచ్చే నెల 10వ తేదీ వరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించనుంది. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాల ద్వారా వడ్లను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 7,436 వేల క్వింటాళ్ల వడ్లను కొనుగోలు చేసినట్లు ఫౌర సరఫరాల శాఖ మేడ్చల్ ? మల్కాజిగిరి జిల్లా మేనేజర్ రాజేందర్ వెల్లడించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వడ్లకు రూ.10 కోట్ల 50 లక్షలను రైతులకు చెల్లించినట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన వడ్లకు రైతుల బ్యాంకు ఖాతాలలో నేరుగా నగదును జమ చేస్తున్నారు. ఈ నెల చివరి వారం వరకు వరి కోతలు పూర్తి కానున్న నేపథ్యంలో వచ్చే నెల 10వ తేదీ వరకు కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తామని, రైతుల పండించిన వడ్లను కొనుగోలు చేసే వరకు కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా వడ్ల కొనుగోలు జరుగుతున్నాయి.యాసంగిలో వడ్లు కొనేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో కొనసాగిస్తున్న ఉద్యమానికి రైతులు మద్దతు ప్రకటిస్తున్నారు. వడ్ల కొనుగోలుపై బీజేపీ అవలంభిస్తున్న ద్వంద్వ వైఖరిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో పండించే వడ్లను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయమని స్పష్టంగా చెబుపుతున్నప్పటికీ రాష్ట్ర బీజేపీ నాయకులు యాసంగిలో వరి వేయాలని రైతులను దగా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులకు దమ్ముంటే కేంద్రాన్ని ఒప్పించి యాసంగిలో వడ్లు కొనేలా చూడాలని రైతులు సవాళ్లు విసురుతున్నారు. రైతుల పక్షాన పోరాటం చేస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు రైతులకు మద్దతును ప్రకటిస్తున్నారు. రెండు నాల్కల ధోరణి అవలంభిస్తున్న బీజేపీకి రానున్న రోజులలో బుద్ధి చెబుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

# గురుకులంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై సుంకే రవి శంకర్ ఆరా



కరీంనగర్ డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): చొప్పదండి సాంఘిక సంక్షేమ గురుకులంలో ఫుడ్‌పాయిజనింగ్ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సుంకే రవిశంకర్.. గురుకులంలో ఆహార పదార్థాలను పరిశీలించారు. బాలికలు అందరూ క్షేమంగా కోలుకుంటున్నారని, ఆందోళన పడొద్దని భరోసా ఇచ్చారు.

చొప్పదండి సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో ఈ ఘటన జరిగింది. దీనిపై ప్రిన్సిపాల్‌తో రవి శంకర్ మాట్లాడారు. ఫుడ్ పాయిజనింగ్ గురించి సమాచారం అందిన వెంటనే కరీంనగర్ కలెక్టర్‌కు ఫోన్ చేసిన ఆయన.. తక్షణం అత్యవసర చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

ప్రిన్సిపాల్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో క్యాబేజీ కూర వల్ల ఫుడ్ పాయిజన్ జరిగిందని, ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని చెప్పారు. పిల్లలంతా కోలుకుంటున్నారని, ఆరోగ్యంగానే ఉన్నారని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.

# యాసంగికి 23.83 టీఎంసీలు నీరు విడుదల : మంత్రి వేముల




నిజామాబాద్, డిసెంబర్ 4: ప్రస్తుత యాసంగి సీజన్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని అన్ని ప్రాజెక్టుల కింద 2,64,832 ఎకరాల్లో సాగయ్యే పంటలకు 23.832 టీఎంసీల నీటిని విడుదలకు నీటిపారుదల సలహా బోర్డు సమావేశంలో ఆమోదించినట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టర్ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మంత్రి హాజరయ్యారు. కామారెడ్డి కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే, జడ్పీ చైర్మన్ విట్టల్‌రావు పాల్గొన్నారు. నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో ప్రగతిభవన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవుడి దయ, సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి తీసుకున్నంటున్న పలు నిర్ణయాలు, హరితహారం, కాళేశ్వరం ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకాలతో రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండి అలుగులు పారాయన్నారు. రెండు జిల్లాల పరిధిలో పంటలకు నీటి విడుదల చేసేందుకు ఎలాంటి రంది లేదని, మంచి భరోసా ఉన్నదన్నారు. పూర్తిస్థాయి ఆయకట్టుకు నీటిని అందించే విషయంలో ఎలాంటి సందేహాలు లేవన్నారు. నీరు పుష్కలంగా ఉన్నందున పరిస్థితులకు అనుగుణంగా నీటి విడుదలలో మార్పులు చేయాల్సి వస్తే, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునే అధికారం చీఫ్ ఇంజినీర్‌కు ఇచ్చినట్లు చెప్పారు.

యాసంగిలో పంటల మార్పు జరిగే అవకాశం ఉన్నందున.. రైతులు ఇతర పంటలు సాగు చేస్తే వారిని ప్రోత్సహించాలని మంత్రి అధికారులకు సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద 43,242 ఎకరాల ఆయకట్టుకు 4.50 టీఎంసీలు, నిజాంసాగర్ కింద 1,98,280 ఎకరాల ఆయకట్టుకు 16.50 టీఎంసీలు, కౌలాస్ నాలా రామడుగు పోచారం ప్రాజెక్టుల కింద 25,280 ఎకరాలకు 2.832 టీఎంసీలు కలిపి మొత్తం 2,64,832 ఎకరాలలో యాసంగి పంటల సాగుకు 23.832 టీఎంసీలు నీటిని విడుదల చేయడానికి బోర్డు ఆమోదించిందని మంత్రి తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా ఆరు తడులుగా డిసెంబర్ 15 నుంచి పదిహేను రోజులు నీటిని విడుదల చేస్తూ పది రోజుల విరామం ఇస్తూ 13 ఏప్రిల్ 2022 వరకు విడుదల చేయడానికి, ఎస్సారెస్పీ ద్వారా డిసెంబర్ 25 నుంచి నిరంతరాయంగా 18 మే 2022 వరకు, అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా ఆరు తడులుగా డిసెంబర్ 18 నుంచి ఏప్రిల్ 18 వరకు, అర్గుల రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా డిసెంబర్ 28 నుంచి ఏప్రిల్ 30 వరకు ఏడు తడుల నీరివ్వనున్నట్లు తెలిపారు. చారం ప్రాజెక్టు ద్వారా జనవరి 1 నుంచి ఏప్రిల్ 20 వరకు తొమ్మిది తడులు, కౌలాస్ నాలా ప్రాజెక్టు ద్వారా డిసెంబర్ 10 నుంచి ఏప్రిల్ 6 వరకు 7 తడులు, రామడుగు ప్రాజెక్టు నుంచి 27 డిసెంబర్ నుంచి ఏప్రిల్ 28 వరకు 7 తడుల నీటిని విడుదల చేయడానికి ఆమోదించినట్లు ఆయన తెలిపారు.

రైతులు ఆలోచించాలి

యాసంగిలో ధాన్యం కొనే అవకాశం లేదని కేంద్రం స్పష్టం చేసిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే పరిస్థితి ఉండదని మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలో రైతులు పరిస్థితిని అర్థం చేసుకొని ఇతర పంటలను సాగు చేయాలని కోరారు. ఏ పంట వేస్తే లాభసాటిగా ఉంటుందో ఆలోచించి ముందుకు వెళ్లాలని సూచించారు. వరి సాగు చేస్తే రైస్ మిల్లర్లతో ముందుగానే ఒప్పందం చేసుకోవాలని, తినడానికి అవసరం మేరకు చేసుకోవాలని, విత్తనాల కోసం సంబంధిత కంపెనీలు తీసుకునే విధంగా ఒప్పందాలుంటే ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో చీఫ్ ఇంజినీర్ మధుసూదన్ రావు, డిప్యూటీ సీఈ అశోక్ కుమార్, కామారెడ్డి సీఈ శ్రీనివాస్, రెండు జిల్లాల ఎస్‌ఈలు బద్రి నారాయణ, కరుణాకర్, వాసంతి, డీసీఎంఎస్ చైర్మన్ మోహన్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జడ్పీ సీఈవో గోవింద్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రోశయ్యకు నివాళులర్పించిన మంత్రులు సబిత, సత్యవతి



హైదరాబాద్, డిసెంబర్ 4: ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య పార్థీవదేహానికి మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి నివాళులర్పించారు. రోశయ్య శనివారం మృతి చెందగా.. హైదరాబాద్ ధరమ్ కరణ్ రోడ్డులోని ఆయన నివాసానికి చేరుకొని పార్థీవదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోశయ్య మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక పదవులను అలంకరించి, వాటికి వన్నె తీసుకువచ్చారన్నారు. వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వడంతో పాటు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి : పార్టీ శ్రేణులకు సజ్జల పిలుపు

గుంటూరు, డిసెంబర్ 4:: జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకంపై ప్రతిపక్షాలు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నాయని, వీరి విమర్శలను పార్టీ శ్రేణులు బలంగా తిప్పికొట్టాలని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సజ్జల టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విస్తృత సమావేశాలు నిర్వహించి జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సజ్జల పార్టీ శ్రేణులకు సూచించారు.

విస్తృత సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉన్నదని, ఈ పథకం ద్వారా ప్రజలకు అందనున్న ప్రయోజనాలను వివరించి చెప్పాలని సజ్జల రామకృష్ణారెడ్డి నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఇది స్వచ్ఛంద పథకం అనే విషయాన్ని ప్రజలకు తెలియచేయాలన్నారు. పథకాలను నిలిపివేయడం గానీ, బెదిరింపులను సహించేది లేదని స్పష్టం చేయాలన్నారు. 1983 నుంచి 2011 వరకు రాష్ట్రంలో గృహనిర్మాణ సంస్థ ద్వారా నిర్మించిన గృహాల లబ్ధిదారులకు మేలు చేసేలా జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారని ఆయన తెలిపారు.

# ఒమిక్రాన్‌కు మరో విభిన్న వ్యాక్సిన్ అవసరం లేదు : డబ్ల్యూహెచ్ఓ

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ఒమిక్రాన్ వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతుందని, అయితే ఈ వేరియంట్ కోసం ప్రత్యేకంగా భిన్నమైన వ్యాక్సిన్ అవసరం ఉండబోదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ముఖ్య శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ పేర్కొన్నారు. కరోనా వైరస్ ఇతర వేరియంట్ల కంటే ఒమిక్రాన్ తేలికపాటి లక్షణాలను కలిగిఉంటుందా..అసలు దీని మూలాలపై నెలకొన్న సందేహాలు వంటి అంశాలు ఇప్పుడే అంచనా వేయడం సాధ్యం కాదని అన్నారు. ఒమిక్రాన్ ప్రాబల్య వేరియంట్‌గా మారే అవకాశం ఉందని చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా 99 శాతం ఇన్ఫెక్షన్స్‌కు డెల్టా వేరియంట్ కారణమవుతోందని, కొద్దినెలల్లో డెల్టా కంటే ఒమిక్రాన్ ద్వారా అధిక ఇన్ఫెక్షన్లు సంక్రమిస్తాయని ఐరోపా యూనియన్, ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారని సౌమ్య స్వామినాథన్ పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో కేసులు రోజూ రెట్టింపవుతున్నాయని ఇది ఒమిక్రాన్ ఎంత వేగంగా వ్యాప్తి చెందుతుందనేది వెల్లడిస్తోందని చెప్పారు. తాజా వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు మనం భయాన్ని వీడి అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. పలు కేసుల్లో ఎలాంటి లక్షణాలు లేకపోవడం, స్వల్ప లక్షణాలు బయటపడుతున్న క్రమంలో ఈ దశలో ఒమిక్రాన్ ప్రభావంపై డబ్ల్యూహెచ్ఓ నిర్ధిష్టంగా అంచనా వేయలేదని చెప్పుకొచ్చారు.

యాంటీబాడీలపై ఒమిక్రాన్ ప్రభావంపై కూడా మనం అప్పుడే ఓ నిర్ణయానికి రాలేమని అన్నారు. గతంలో ఇన్ఫెక్షన్ సోకడం ద్వారా సమకూరిన సహజ రోగనిరోధక శక్తిని ఒమిక్రాన్ కొంత అడ్డుకోగలుగుతున్నట్టు కనిపిస్తోందని చెప్పారు. ఒమిక్రాన్ సోకినవారు తీవ్ర అనారోగ్యానికి గురికావడంలేదని అంటే వ్యాక్సిన్లు ఇప్పటికీ రక్షణ కల్పిస్తున్నాయని మనం ఆశించవచ్చని ఆమె పేర్కొన్నారు.




# మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేత..



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి) :ప్రపంచ దివ్యనీగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మై వేములవాడ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుక్స్,పెన్నులు అందజేయడం జరిగింది. శనివారం మండల విద్యాధికారి కార్యాలయం ఆవరణలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యం గుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ములో ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి డి.రాథాకృష్ణ పాల్గొన్నారు. జిల్లవిద్యాధికారి డి.రాధాకృష్ణ చేతులమీదుగా దివ్యానీగ విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు మరియూ పెన్సిల్స్ అందజేయడం జరిగింది. ఈసందర్బంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలని, ప్రతి విద్యార్థి వెంట మేము ఉంటామని అన్నారు. వీరికి సేవచేసే భాగ్యం మాకు దక్కడం అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ విద్యాసాగర్, మండల విద్యాధికారి బన్నాజీ, ఫిజియోథెరపి డాక్టర్ నెరేళ్ల మయూరి, ట్రస్ట్ సభ్యులు గొంగళ్ల రవికుమార్, తాళ్లపల్లి ప్రశాంత్, నాగుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటె విజేతలను అభినందించిన కమిషనర్ ఆఫ్ పోలీస్



కరీంనగర్ డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): ఇటీవల కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ టు ఆల్ కరాటె చాంపియన్ షిప్ లో కరీంనగర్ ఓకినవ మార్షల్ ఆర్ట్స్ అకాడమి చెందిన విద్యార్థిని , విద్యార్థులు పాల్గొని చక్కని ప్రతిభ కనపరచి పలు మెడల్స్ సాధించి నట్లు ఓకినవ సంస్థల చీఫ్ ఇన్స్ట్రక్టర్ కె . వసంత్ కుమార్ తెలిపారు . ఇటీవల జరిగిన ఫస్ట్ వర్డ్ ఆన్లైన్ ఈకటా చాంపియన్ షిప్ లో 2021 పాల్గొన్న 8 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాదించగా 5 గురు విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఈ విద్యార్థులు పుల్లూరి శ్రీనివాస్ శిక్షణలో శిక్షణ పొంది ఈ పోటీలలో మెడల్స్ సాదించారు ఇటీవల కరీంనగర్ లో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ టు ఆల్ చాంపియన్ షిప్ లో ఓకినవ మార్షల్ ఆర్ట్స్ అకాడమి కరీంనగర్ చెందిన విద్యార్థులు 11 గోల్డ్ , 5 సిల్వర్ , 31 బ్రాంచె మెడల్స్ సాధించినట్లు వీరిని శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో కరీంనగర్ కమిషనర్ ఆఫ్ ఆప్ పోలీస్ వి . సత్యనారాయణ ప్రత్యేకంగా అభినంది ంచారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మాయిలకు కరాటె ఆత్మ రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని కరాటె శిక్షణ పొందిన విద్యార్థిని , విద్యార్థులు క్రమ శిక్షణ కలిగి ఉండాలని అన్నారు . ఈ కార్యక్రమవ ంలో కరాటె ఇన్స్ట్రక్టర్ పి . శ్రీనివాస్ , బుర్ర ప్రవీణ్ కుమార్ , రాజశేఖర్ , రిషికుమార్ లు పాల్గొన్నట్లు ఓకినవ సంస్థల చీఫ్ ఇన్స్ట్రక్టర్ కె . వసంత్ కుమార్ తెలిపారు .

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, ఎమ్మెల్యే

హైదరాబాద్, డిసెంబర్ 4:నేడు అమావాస్య సందర్భంగా బాచుపల్లి మండల ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో నిజాంపేట్ హనుమాన్ దేవాలయం వద్ద మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు చేస్తున్న అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఔఓఆ తెరాస అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు అభిషేక్ రెడ్డి, తలారి వీరేష్ ముదిరాజ్, తెరాస నాయకులు రవికాంత్, తెరాస నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.




# టీటీడీ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు : బోర్డు సభ్యుడు విద్యాసాగర్‌రావు

జగిత్యాల, డిసెంబర్ 4: : టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నిరుపేదలకు సామూహిక వివాహాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు టీటీడీ బోర్డు సభ్యుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. తిరుమలలో గురు, శుక్రవారాల్లో జరిగిన టీటీడీ పాలకమండలి, ధర్మప్రచార కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం తిరుమలలో ఆయన మాట్లాడుతూ.. టీటీడీ పాలకమండలి, దాని అనుబంధ ధర్మ ప్రచార కమిటీ మండలి సమావేశాల్లో ముఖ్య నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

ఏపీ తెలంగాణ, రాష్ట్రాల్లోని ప్రతి దేవాలయాలోనూ గోమాతను పెంచాలని, దీన్ని టీటీడీ పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల్లో ఎక్కడ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు నిర్వహించినా.. టీటీడీ తరఫున సహాయం, కల్యాణ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు. గ్రామస్థాయిలో, నియోజక వర్గ కేంద్రాల్లో ఎక్కడ స్వామి వారి కల్యాణ ఉత్సవాలు నిర్వహించాలని భావించినా ఆ విషయాన్ని టీటీడీ పాలక వర్గంలో తెలియజేస్తే పాలక వర్గంరెండు రాష్ట్రాల్లో గతంలో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాలు, కల్యాణమండపాలు నిర్మించగా.. చాలా చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఈ విషయంపై చర్చ జరిగిందని, పెండింగ్ పనులకు సహాయం చేయనున్నట్లు తెలిపారు. పెండింగ్ పనులను గుర్తించేందుకు నిపుణులతో కమిటీ వేశామన్నారు. కమిటీ రెండు రాష్ట్రాల్లోని వాటిని ప్రత్యక్షంగా గుర్తించి నివేదిక అందజేస్తుందని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని పాలకవర్గం తీర్మానించినట్లు చెప్పారు. త్వరలోనే నిపుణుల కమిటీ నిర్మాణాలను పరిశీలిస్తుందన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల్లో పేదలకు సామూహిక వివాహాలను జరిపించాలని, నవ దంపతులకు రెండు మాసాల బంగారం సైతం అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో ప్రతి మండలంలో ప్రచార మండలి సభ్యులను నియమించి వారితో ధర్మ ప్రచారం, హైందవ మత ఔనత్యాన్ని చాటి చెప్పాలని తీర్మానించినట్లు వివరించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఇతర సభ్యులు తెలంగాణకు చెందిన పాలకమండలి సభ్యులకు గొప్పగా సహకారం అందిస్తున్నారు.

# కోర్టుల్లో మౌలిక వసతులకు అకాడమి కావాలన్న సీజేఐ ఎన్వీ రమణ !

హైదరాబాద్, డిసెంబర్ 4: జ్యుడిషియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగుదలకు నూతన సంస్థను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ఎన్వీ రమణ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించారు. నేషనల్ జ్యుడిషియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌జేఐఏఐ) ను ఏర్పాటు చేయాలని సీజేఐ నుంచి తమకు ప్రతిపాదన వచ్చిందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు శుక్రవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నకు రాతపూర్వక సమాధానంలో చెప్పారు.

దేశవ్యాప్తంగా కోర్టుల్లో సరైన మౌలిక వసతులను కల్పించే బాధ్యతను ఎన్‌జేఐఏఐ పర్యవేక్షిస్తుంది. ఈ ప్రతిపాదన ప్రకారం సదరు సంస్థకు సీజేఐ ప్యాట్రన్ ఇన్‌ఛీఫ్‌గా వ్యవహరిస్తారు. దేశంలోని 25 రాష్ట్రాల హైకోర్టుల పరిధిలోని భారతీయ కోర్టు వ్యవస్థ నిర్వహణ, ఫంక్షనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు కార్యాచరణ ప్రణాళికను ఈ సంస్థ రూపొందిస్తుంది. ప్రస్తుతం జ్యుడీషియరీ విభాగంలో మౌలిక వసతులను కల్పించాల్సిన ప్రాథమిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. రాష్ట్ర ప్రభుత్వాలకు వనరులను పెంపొందించడానికి జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి కేంద్రం ఓ పథకాన్ని అమలు చేస్తున్నది. నిర్దిష్ట నిష్పత్తితో కూడిన నిధుల వాటా కింద కోర్టుల్లో వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం నిధులు విడుదల చేస్తుంది. 1993–94 నుంచి అమలవుతున్న ఈ పథకానికి కేంద్రం రూ.8709.77 కోట్లు మంజూరు చేసింది. నాటి నుంచి సమయానుకూలంగా ఈ పథకాన్ని పొడిగిస్తూ వచ్చింది. తాజాగా దీన్ని 2026 మార్చి వరకు పొడిగించినట్లు కిరెన్ రిజిజు చెప్పారు. మొత్తం బడ్జెట్ కేటాయింపులు రూ.9000 కోట్లయితే, ఇందులో కేంద్రం వాటా రూ.5,307 కోట్లు అని తెలిపారు. ఈ నిధులతో జిల్లా, సబార్డినేట్ కోర్టులు, జడ్జిలకు నివాస గృహాలు నిర్మిస్తారు.

# తుపాన్ తగ్గేవరకు బయటకు రావొద్దు: ప్రజలకు మంత్రి సూచన

అమరావతి, డిసెంబర్ 4: శ్రీకాకుళంలోని జవాద్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పల రాజు పర్యటించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రభావిత ప్రాంతాలలో శనివారం మంత్రి అప్పల రాజు పరిశీలించారు. పలాస మున్సిపాలిటీ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తను తొలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ సిబ్బంది సహాయంతో పూడికలు తొలిగించి, జేసిబిలతో డ్రైనేజీ అడ్డంకులు తొలిగించారు. అనంతరం పలాస మండలం బ్రహ్మణతర్ల, అమలకుడియా ప్రాంతాల్లో పర్యటించి తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటపొలాలను పరిశిలించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రజలు ఎవరూ తుఫాన్ తీవ్రత తగ్గేవరకు బయటకు రాకూడదని విజ్ఞప్తి చేసారు.

# అటవీ పునరుజ్జీవన పనులతో పెరుగుతున్న పచ్చదనం

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: ప్రత్యామ్నాయ అటవీకరణ నిధులతో (కంపా) చేపడుతున్న అటవీ పునరుద్ధరణ పనులు తెలంగాణలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. క్షీణించిన అటవీ ప్రాంతాల్లో అటవీ పునరుజ్జీవన పనుల ద్వారా మళ్లీ పచ్చదనం పెరుగుతున్నది. హైదరాబాద్‌కు అతి సమీపంలో రంగారెడ్డి జిల్లాలో పూర్తిగా పట్టణీకరణ జరిగిన ప్రాంతాల్లో 84 బ్లాకుల్లో 29,545 హెక్టార్ల అటవీ ప్రాంతం విస్తరించి ఉన్నది. పట్టణీకరణకు సమీపంలోని విలువైన అటవీ ప్రాంతాలను రక్షిస్తూ, మళ్లీ పచ్చదనం చిగురింపజేసే కార్యాచరణను అటవీ శాఖ అమలు చేస్తున్నది.

దీనివల్ల హైదరాబాద్ పరిసర వాసులకు ప్రకృతి, పచ్చదనం, స్వచ్ఛమైన గాలి లభిస్తాయి. రంగారెడ్డి జిల్లాలో ప్రత్యామ్నాయ అటవీకరణ చేపట్టిన ప్రాంతాల్లో అటవీ శాఖ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. పీసీసీఎఫ్ (కంపా) లోకేశ్ జైస్వాల్, అదనపు పీసీసీఎఫ్ సునీతా భగవత్ రంగారెడ్డి జిల్లాలో స్థానిక అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం, కందుకూరు, అమనగల్, శంషాబాద్, మంఖాల్ అటవీ రేంజ్‌లలో పర్యటించారు. ప్రతి డివిజన్‌లో రేంజ్‌ల వారీగా క్షేత్ర స్థాయిలో చేపట్టిన పనుల పురోగతి,



నాణ్యతలను పరిశీలించారు.

గున్గల్ అటవీ రేంజ్ పరిధిలోని రెండు ప్రాంతాల్లో 160 హెక్టార్లలో.. గుమ్మడవల్లి, మాదాపూర్ ప్రాంతాల్లో 105 హెక్టార్లలో.. పద్మల్ రిజర్వు అటవీ ప్రాంతంలో 70 హెక్టార్లలో.. కొత్వాల్ గూడ, మల్కారంలలో 82 హెక్టార్లలో.. పల్లెగూడ రిజర్వు ఫారెస్ట్‌లో 57 హెక్టార్లలో అటవీ శాఖ కంపా నిధుల ద్వారా ప్రత్యామ్నాయ అటవీకరణ, అటవీ పునరుద్ధరణ పనులను చేపట్టింది. గత మూడు, నాలుగేళ్లుగా నాటిన మొక్కల సంరక్షణతోపాటు, ఖాళీలు ఉన్నచోట్ల గ్యాప్ ప్లాంటేషన్ చేపడుతున్నారు.

అన్ని అటవీ ప్రాంతాల చుట్టూ ఆక్రమణల నివారణలో భాగంగా కందకాలు లేదా చైన్ లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు, గట్లపైన గచ్చకాయ చెట్ల పెంపకం, భూసారం పెరిగేలా చర్యలు, చెక్ డ్యామ్‌లు, వర్షం నీటి నిలువ కోసం కందకాల తవ్వకం, నర్సరీల పెంపు, వంద శాతం అటవీ పునరుద్ధరణలో భాగంగా మొక్కలు నాటడం, తద్వారా అటవీ సాంద్రత పెంపు చర్యలను అటవీ శాఖ చేపట్టింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించిన పీసీసీఎఫ్ (కంపా) లోకేశ్ జైస్వాల్.. పనుల పురోగతి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తంచేశారు. మరింత సమర్థవంతమైన ఫలితాలు రాబట్టడంపై పలు సలహాలు, సూచనలు చేశారు.

అటవీ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ కోసం చేపట్టిన ఈ పర్యటనలో రంగారెడ్డి చీఫ్ కన్జర్వేటర్ సునీతా భగవత్, ఆమనగల్, శంషాబాద్ ఫారెస్ట్ డివిజనల్ అధికారులు ఎం జానకిరామ్, విజయానంద్, స్థానిక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోశయ్య మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 4: మాజీ సీఎం రోశయ్య మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం ధరమ్ కరణ్ రోడ్డులోని రోశయ్య నివాసానికి చేరుకొని పార్థీవదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రోశయ్య సీఎంగా, గవర్నర్‌గా ఇలా అనేక పదవులను అలంకరించి, వాటికి వన్నె తీసుకువచ్చారన్నారు. సందర్భాన్ని బట్టి చలోక్తులు విసిరే వారని, సభలో చాలా హుందాగా వ్యవహరించే వారన్నారు. రోశయ్యను ఎప్పుడు కలిసిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి గురించి అడిగే వారన్నారు. జిల్లా అభివృద్ధికి నిధుల మంజూరు విషయంలో ఎప్పుడు ఏ సహాయం కావాలన్న చేస్తాను అనే వారిని మంత్రి గుర్తు చేసుకున్నారు.

# మాజీ ముఖ్యమంత్రి రోశయ్య భౌతికకాయానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి):రాజనీతిజ్ఞుడు, అపర చాణిక్యుడు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మృతి పట్ల హైదరాబాదులో ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప వక్త, ఆర్థిక మంత్రిగా అపార అనుభవం ఉన్న నాయకుడు, అత్యధిక సార్లు బడ్జెట్లు ప్రవేశపెట్టిన మంత్రిగా ఘనత ఆయనదే. రోశయ్య మృతితో కాంగ్రెస్ పార్టీ గొప్ప అనుభవశాలిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నాను. రాజకీయాల్లో ఉన్నత విలువలు కలిగిన వ్యక్తిని తెలుగు రాష్ట్రాలు కోల్పోయామని, ఆయన మరణం తెలుగు రాష్ట్రాలకి తీరని లోటు. రోశయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తు, ఆయన ఆత్మకు శాంతి చేకూరలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానీ అని ఆయన అన్నారు



# రవీందర్ రెడ్డి ఆశయసాధనకు చేయాలి-జడ్పిటిసి నాగం కుమార్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మాజీ ఎంపీపీ గడ్డం రవీందర్ రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చందుర్తి జడ్పిటిసి సభ్యులు నాగం కుమార్ అన్నారు. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన గడ్డం రవీందర్ రెడ్డి గత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా చందుర్తి మండల కేంద్రంలో ఎంపిటీసీ సభ్యులు పులి రేణుక సత్యం ఆధ్వర్యంలో శనివారం సంతాపసభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్పిటిసి కుమార్ మాట్లాడుతూ గడ్డం రవీందర్ రెడ్డి గ్రామ సర్పంచిగా. రెండు సార్లు ఎంపీగా పనిచేశారు మండల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. రవీందర్ రెడ్డి ఎంపీపీ గా పనిచేసిన సాదా సీదా జీవితం గడిపారన్నారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బులతో కూడుకున్నయని ఇందుకు నిదర్శనం ఇటీవల నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపు రాజకీయాలే అన్నారు. రవీందర్ రెడ్డి ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుతామని పిలుపునిచ్చారు. రవీందర్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య. మాజీ సర్పంచ్ గొట్టె ప్రభాకర్ నాయకులు తిరుపతి రావు. లింగంపల్లి బాబు. కట్కూరు చంద్రయ్య. దేవస్వామి. పిట్టల బాబు. వట్టిమల్ల రవి. మర్రి మల్లేశం. పుల్లూరి తిరుపతి. దారం చంద్రం. దెబ్బటి వెంకటేశం. హనుమయ్య చారి. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్. సీనియర్ పాత్రికేయులు గడ్డం తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# పోలీస్ ఎఫెక్ట్ -సరిదిద్దబడిన కూరగాయల మార్కెట్లు

కరీంనగర్ డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): ఇటు వాహనదారులు, అటు పాదాచారులకు ఇబ్బందులు కలిగించిన రోడ్లపైనే కూరగాయల మార్కెట్లు పోలీసుల చొరవతో శనివారంనాడు సరిదిద్దబడ్డాయి. రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారులు కూరగాయల విక్రయాలు గతకొన్ని సంవత్సరాలుగా జురుపుతుండటంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనడటమే కాకుండా ట్రాఫిక్ అంతరాయం సమస్య రోజురోజుకూ పెరిగిపోతూ వచ్చింది.

కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ శుక్రవారంనాడు శనివారం మార్కెట్‌తో సహ రోడ్లను ఆనుకుని కూరగాయలు విక్రయించే ప్రధాన కూరగాయమార్కెట్ ప్రాంతాలను సందర్శించిన విషయం విదితమే. ఈ సందర్శనలో భాగంగా పోలీస్ కమీషనర్ రోడ్లను ఆక్రమించుకుని కూరగాయలను విక్రయించడం వల్ల కలిగుతున్న ఇబ్బందులు శనివారం మార్కెట్‌ప్రాంతంలో కూరగాయ విక్రయానికి ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేసినా ఆయా ప్రదేశాల్లో విక్రయాలు జరుపకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులపై వ్యాపారులను అవగాహన కల్పించారు. ఇక వెంకటేశ్వర ఆలయ ఎదురుగా గల ప్రధాన కూరగాయల మార్కెట్లో రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారులు విక్రయాలు జరుపడం వల్ల తలెత్తున్న ట్రాఫిక్ సమస్య, వాహనదారులు, పాదాచారాలకు కలుగుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించి వ్యాపారులు ఈ మాదిరిగా కూరగాయల మార్కెట్లో అమ్మకాలు కొనసాగించడం వల్ల అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయిన అవగాహన కల్పించారు. రోడ్లు ప్రారంభం ప్రాంతంలో కూరగాయల విక్రయాలు ఏర్పాటు చేసినట్లయితే అన్నివర్గాల ప్రజలు ఎలాంటి ఎదుర్కొకూండా కొనుగోలు చేయడంతోపాటు కొనుగోలు దారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని సూచించారు. శనివారం మార్కెట్‌ప్రాంతంలో కూరగాయలను రోడ్లపై విక్రయాలు కొనసాగించకూడదని, మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన షెడ్లల్లో మాత్రమే విక్రయించాలని ఖరాఖండిగా తెలిపారు.

కరీంనగర్ టౌన్ ఏసిపి తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు జి తిరుమల్, నాగార్జున, ప్రత్యేక బృందాలకు చెందిన పోలీసులు ఉదయం నుండి కూరగాయల విక్రయదారులు ఒక క్రమపద్దతిలో కూరగాయలు విక్రయించేలా చర్యలు తీసుకున్నారు.

కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయన పైన పేర్కొన్న ప్రాంతాల్లో కాలినడకన



పర్యటించి కూరగాయల విక్రయదారులు ఒకక్రమపద్దతిలో విక్రయాలు కొనసాగించడం వల్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యాపారులు, కొనుగోలుదారులు పోలీస్ కమీషనర్ తీసుకున్న చర్యలను అభినందించారు. అన్నివర్గాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. భవిష్యత్‌లోకూడా కూరగాయల వ్యాపారులు ఇదే విధానాన్ని అవలంభిస్తూ ఆదర్శప్రాయంగా నిలువాలని కోరారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com